# హిమోఫీలియా రోగి గుండెకు అరుదైన శస్త్రచికిత్స

## చెన్నై 'మియాట్' వైద్యుల ఘనత

**చెన్నై, న్యూస్‌టుడే:** హృదయ ఆరోహణ బృహద్ధమని ఉబ్బడం, ఆ ధమని కవాటం నుంచి రక్తం కారడం వంటి సమస్యతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ హిమోఫీలియా రోగికి చెన్నైలోని మియాట్ ఆసుపత్రి వైద్యులు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ వివరాలను ఆసుపత్రి ఛైర్మన్ మల్లికా మోహన్‌దాస్, హృద్రోగ నిపుణులు డాక్టర్ వీవీ బాషీలు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. వంశపారంపర్యంగా పురుషులకు మాత్రమే సంక్రమించే ఈ అరుదైన హృద్రోగ సమస్యతో కేరళకు చెందిన బిను నెట్టికడన్(38) గత కొంత కాలంగా బాధపడుతున్నారు. అతడు పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా పరిస్థితి మెరుగుపడకపోవడంతో మియాట్ వైద్యులను సంప్రదించాడు. హిమోఫీలియాతో బాధపడే రోగులకు చిన్న శస్త్రచికిత్స చేయాలన్నా ఎంతో ప్రమాదకరం. అలాంటి వారికి రక్తస్రావం విపరీతమై ప్రాణాపాయస్థితికి దారితీస్తుంది. దాంతో హృదయ-శ్వాసకోశ యంత్రంపై అత్యంత సంక్లిష్టమైన ఈ శస్త్రచికిత్స చేయడం వైద్యులకు సవాల్‌గా మారింది. ఇలాంటి రోగికి కృత్రిమ లోహ కవాటం(మెటాలిక్), నానో కవాటాలను వినియోగించడానికి వీలుకాని పరిస్థితి. అలా చేస్తే రోగికి మళ్లీ సమస్య పునరావృతం అవుతుందని డాక్టర్ బాషీ చెప్పారు. దాంతో తాము పలు వైద్య సాంకేతిక అంశాలను పరిశీలించి రోగికి ఉన్న సహజసిద్ధమైన కవాటాన్నే విజయవంతంగా సరిచేయగలిగామన్నారు. మొత్తం 15 మందితో కూడిన వైద్యబృందం ఏడు గంటలకు పైగా శ్రమించి ఈ శస్త్రచికిత్సను విజయవంతంగా చేశామన్నారు. ప్రస్తుతం రోగి కోలుకుంటున్నాడన్నారు. ఎంతో ఖర్చుతో కూడుకున్న ఈ శస్త్రచికిత్సకు ఎల్‌ఏ కమ్యూనికేషన్స్ ప్రాజెక్టు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఉషా పార్థసారథి సహాయం చేశారు. తాను ఇక చనిపోతానేమో అనుకుంటున్న తరుణంలో మియాట్ వైద్యులు తనకు పునర్జన్మ ప్రసాదించారని రోగి బిను వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.




**బిను (నీలం చొక్కా)తో మల్లికామోహన్‌దాస్, డాక్టర్ బాషీ, ఉషా పార్థసారథి తదితరులు**